

వైవీయూలో ప్రధానాచార్యులకు అవగాహన సదస్సు

కడప అర్బన్ : జాతీయ విద్యా విధానం-2020 కళాశాలల స్థాయిలో అమలులో ప్రిన్సిపాల్స్ పాత్ర కీలకమని వైవీయూ విసి ఆచార్య జింక రంగ జనార్ధన్ స్పష్టం చేశారు. విశ్వవిద్యాలయ కళాశాలలు అభివృద్ధి మండలి డీన్ ఆచార్య వై సుబ్బ రాయుడు అధ్యక్షతన జాతీయ విద్యా విధానం (ఎన్ఇపి) ద్వారా డిగ్రీ, ఆనర్స్ లో విద్యార్థుల ప్రవేశాలపై జిల్లాలోని ప్రధానాచార్యులకు అవగాహన కార్యక్రమం విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య విసి మాట్లాడుతూ ఎంఈపి అమలులో ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని గుర్తు చేశారు. విద్యార్థికి పట్టు ఉన్న సబ్జెక్టు మేజర్ గాను, మరో రెండు సబ్జెక్టులు మైనర్ గాను చదవాల్సి ఉంటుందన్నారు. మూడేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులైన వారికే నాలుగో సంవత్సరంలో ప్రవేశం ఉంటుందని స్పష్టం చేశారు. రిజిస్ట్రార్ ఆచార్య వై. పి. వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ ఎన్ఇపి -2020 విద్యార్థులకు బహుళ ప్రయోజనకరమన్నారు. వైవీయూ పీజీ కళాశాల ప్రిన్సిపల్ కె. కృష్ణారెడ్డి డిగ్రీ ప్రవేశాలకు వచ్చే ఇంటర్ విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

కోవిడ్ బిల్లుల గోల్‌మాల్

- రూ.68 లక్షలు స్వాహాయత్నం!?
- జూనియర్ అసిస్టెంట్ ఖాతాలోకి మళ్లింపు
- మళ్లింపు వెనుక హస్తం ఎవరిదో?
- నిద్రావస్థల్లో డిఎంహెచ్ఒ కార్యాలయం



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కోవిడ్ బిల్లుల చెల్లింపుల గోల్‌మాల్ వ్యవహారం గుట్టుచప్పుడుగా నడుస్తోంది. 2019 ఏప్రిల్ ఒకటిన జిల్లాలో కరోనా వైరస్ కేసులు బయట పడిన సంగతి తెలిసిందే. కరోనా కేసులు పదుల సంఖ్యలో బయటపడడంతో ప్రజానీకం ఉలిక్కి పడింది. డిఎంహెచ్ఒ జిల్లా అధికార యంత్రాంగం కరోనా వైరస్ వ్యాప్తి నియంత్రణకు మందుల కొనుగోలు దగ్గర నుంచి మందులు, వ్యాక్సిన్స్ సరఫరా, ఇతర వైద్య అవసరాల నిమిత్తం పెద్దఎత్తున నిధులను వ్యయం చేసిన సంగతి తెలిసిందే. ఆర్నెళ్ల కిందట కోవిడ్ బిల్లుల సెక్షన్ బాధ్యతలను ఓ జూనియర్ అసి స్టెంట్‌కు అప్ప గించారు. కం పాషనేట్ కింద ఉద్యోగంలోకి వచ్చిన జూనియర్ అసిస్టెంట్ కోవిడ్ బిల్లుల చెల్లింపుల్లో భాగంగా రూ.8 లక్షల కోవిడ్ బిల్లుల్ని, రూ.60 లక్షలు బయో మెడికల్ వేస్టేజ్ బిల్లుల్ని నాలు గు బిల్లులుగా విభజించి తన బ్యాంకు ఖాతాలోకి మళ్లిం చినట్లు సమాచారం. ఏశాఖలోనైనా బిల్లుల చెల్లిం పుల వ్యవహారంలో సూపరింటెండెంట్ పర్యవేక్షణ దగ్గర నుంచి డిఎంహెచ్ఒ ఎఒ, డ్రాయింగ్ ఆఫీసర్ల సంతకాలు లేనిదే ముందుకు సాగే అవకాశాలు లేనట్లు తెలుస్తోంది. ఇటువంటి పరిస్థితుల్లో కొత్తగా విధుల్లో చేరిన జూనియర్ అసిస్టెంట్ ఇంతటి స్వాహా యత్నానికి పాల్పడడం అరుదనే చెప్పాలి. జూనియర్ అసిస్టెంట్‌ను అడ్డుపెట్టుకుని కార్యాలయ ఉద్యోగుల్లో కొందరు తెరవెనక ఉండి బాగోతాన్ని నడిపారా, లేక కంపాషనేట్ కింద నియమితుడైన జూనియర్ అసిస్టెంట్ తెగించి లక్షలాది రూపాయల స్వాహా యత్నానికి పాల్పడ్డారా అనే విషయం పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. డిఎంహెచ్ఒ కార్యాల యంలోని కొంత మంది వైద్యులకు నాలుగు నెలల వేతనాల్ని వేయాల్సి ఉండగా ఆరు నెలల వేతనాల్ని జమ చేసినట్లు ప్రచారంలో ఉంది. కోవిడ్ బిల్లులు, బయోమెడికల్ వేస్టేజ్ బిల్లు చెల్లింపుల గోల్ మాల్ విషయం వెలుగులోకి రావడంతో పోలీసుల సహాయంతో అదుపులోకి తీసుకుని స్వాహాయత్నం కథ ముగింపునకు పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఏదేమైనా డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఎఫ్ఆర్ఎస్ బాధ్యతల దగ్గర నుంచి ప్రయివేట్, కార్పొరేట్ ఆస్పత్రుల తనిఖీలు, కోవిడ్ బిల్లుల బాధ్యతల అప్పగింత వరకు విమర్శల పరపర కొనసాగుతున్న సంగతి తెలిసిందే. కోవిడ్ బిల్లుల చెల్లింపుల గోల్‌మాల్ వ్యవహారంపై డిఎంహెచ్ఒను పలుమార్లు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు. అడిషనల్ డిఎంహెచ్ఒను సంప్రదించగా గోల్‌మాల్ బాగోతం వాస్తవమేనని, రికవరీ చేయించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పడం గమనార్హం.

గడువులోగా అభివృద్ధి పనులు పూర్తి

- కలెక్టర్ వి.విజయ్ రామరాజు

ప్రజాశక్తి - కడప

జిల్లాలో రీసర్వే, భూ సేకరణ పనులతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను లక్ష్యం మేరకు పూర్తి చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి రీసర్వే, జాతీయ రహదారుల కోసం భూ సేకరణ, హౌసింగ్, రెవెన్యూ, వ్యవసాయ అనుబంధ రంగాలు, పిఆర్ అండ్ ఆర్ డి, వివిధ ప్రభుత్వ పథకాల అమలుపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డా.జవహర్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కార్యక్రమానికి స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలు నుంచి కలెక్టర్‌తోపాటు జెసి గణేష్ కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ రాహుల్ మీనా సంబంధిత అధికారులు హాజరయ్యారు. సిఎస్ విసి ముగిసిన అనంతరం కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫలాలు.. ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలని ఆదేశించారు. జిల్లాలో రీ సర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలని, ఎక్కడ పెండింగ్ లేకుండా రాళ్లను పాతాలని పేర్కొన్నారు. రెవెన్యూ, భూ రికార్డుల స్వచ్ఛీకరణ పనులను అన్ని జిల్లాల్లో వేగవంతం చేయాలన్నారు. రాష్ట్రంలో జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ కోసం చేపడుతున్న భూ సేకరణ, పరిహారం ప్రక్రియలను త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. వేసవి సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి అవసరాలకు ఎలాంటి కొరత లేకుండా పథకాలను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా పశు సంవర్ధక శాఖ పరిధిలో లైవ్ స్టాక్ పెంపుదల, వేసవిలో సంక్రమించే సీజనల్ వ్యాధుల నుండి పశు పక్షాదులను కాపాడేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు. పశు వైద్య కేంద్రాల్లో వసతులను మెరుగు పరచాలన్నారు. వన్య ప్రాణుల సంరక్షణ, తాగునీటి సదుపాయం కల్పించడంలో అటవీ శాఖ, డ్వామా శాఖల పరిధిలో చర్యలను పటిష్టంగా చేపట్టాలని సూచించారు. గ్రామ సచివాలయాలు, ఆర్‌బికె, హెల్త్ క్లినిక్‌లు స్టేజ్ కన్వర్షన్ మీద ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. అన్ని అంశాల్లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని అధిగమించేందుకు కృషి చేయాలన్నారు. సమావేశంలో డ్వామా, డిఆర్‌డిఎ, ల్యాండ్ సర్వే, హౌసింగ్, వ్యవసాయ అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఇంజనీరింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ఆరు వికెట్ల తేడాతో కడప జట్టు విజయం

కడప : అండర్- 23 వన్డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంటులో భాగంగా గురువారం స్థానిక వైఎస్ రాజారెడ్డి ఏసీఏ స్టేడియంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప జట్టుకు చెందిన జహీర్ అబ్బాస్ అద్భుతంగా బ్యాటింగ్‌లో రాణించి సెంచరీ చేయడంతోనూ, బౌలింగ్ విజయ భాగేంద్ర రాణించడంతో కడప 6 వికెట్ల తేడాతో కర్నూలు జట్టుపై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న కర్నూలు జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 254 పరుగులు చేసింది. ఆ జట్టులోని మహేంద్ర 51, సాయి సూర్య తేజ 48 పరుగులు చేశారు. కడప జట్టులోని విజయభావేంద్ర అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 4 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం 255 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగుకు దిగిన కడప జట్టు 42 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 25 పరుగులు చేసి 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఆ జట్టులోని జహీర్ అబ్బాస్ 87 బంతులను ఎదుర్కొని ఏడు బౌండరీలు 6 బౌండరీ సిక్సుల సహాయంతో 110 (సెంచరీ) పరుగులు చేసి జట్టు విజయానికి దోహదపడ్డారు. కర్నూలు జట్టులోని కనీష్ ఒక వికెట్ తీసుకున్నాడు.

సచివాలయ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలి

పోరుమామిళ్ల టౌన్ : సచివాలయ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని పంచాయతీరాజ్ అభివృద్ధి రాష్ట్ర పరిశీలకులు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని పులివీడు, సిద్ధవరం, చల్లగిరిగల సచివాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయంలో గ్రీవెన్స్ సెల్‌కు ఉద్యోగులందరూ హాజరు కావడం లేదని, ముఖ్యంగా విఆర్ఒలు, సర్వేయర్లు సచివాలయాలకు రావటం లేదని తనకు తెలిసిందని పేర్కొన్నారు. పులివీడు విఆర్ఒ వెంకటేశ్వర్లును డిప్యూటేషన్ ఇక్కడికి వేయడం జరిగిందని, కానీ ఎప్పుడూ సచివాలయానికి రాలేదని, తహశీల్దార్ కార్యాలయంలోనూ ఉండడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చాలా మంది అధికారులపై ఆరోపణలు వస్తునానయని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


అధికారుల నిర్లక్ష్యం తగదు

కాశినాయన : మండలంలోని పేదల భూ సమస్యలపై అధికారుల నిర్లక్ష్యం తగదని వ్యవసాయ కార్మిక సంఘం మండల ప్రధాన కార్యదర్శి పోలయ్య పేర్కొన్నారు గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ మండలంలో భూ సమస్యల రోజురోజుకూ పెరిగిపోతున్నాయని పేర్కొన్నారు. అధికారులు పరిష్కరించే పరిస్థితిలో లేరని తెలిపారు. దీంతో పేదలు చాలా ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. జిల్లా అధికారులైన స్పందించి పేదల భూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

ముగిసిన కేజీ సెట్-2కె23

ప్రజాశక్తి - కడప అర్బన్

నగర శివారులోని కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల, కెఎల్ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కెజీ సెట్-2కె23 గురువారం విజయవంతంగా ముగిసిందని కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాదితో పోలిస్తే ఈసారి రాయలసీమలోని వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని పేర్కొన్నారు. పరీక్షా ఫలితాలను ఈనెల 30న విడుదల చేస్తామని పేర్కొన్నారు. అనంతరం కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తుకు ఆల్ ద బెస్ట్ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ కందుల మదన్ మోహన్ రెడ్డి, కరస్పాండెంట్, సెక్రటరీ కందుల రాజేశ్వరమ్మ, మహిళా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. వి. రత్నమ్మ, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, కేజీ సెట్-2కె23 కన్వీనర్ టి. కిషోర్ కుమార్, అడ్మిషన్ కమిటీ డీన్ కె. రామ్మోహన్ రెడ్డి, సెట్ కార్య నిర్వాహక సిబ్బంది, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.




హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్‌డి చంద్ర ఓబుల్‌రెడ్డి

పసుపు రైతుల రాష్ట్ర కమిటీ సభ్యులుగా గోపాలకృష్ణయ్య

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

పసుపు రైతుల రాష్ట్ర కమిటీ సభ్యులుగా మండలానికి చెందిన గోపాలకృష్ణయ్యను ఎన్నుకున్నారు. బుధవారం గుంటూరు జిల్లా దుగ్గిరాల పసుపు వర్తకుల భవనంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సమావేశంలో ఆయన్ను రాష్ట్ర కమిటీ ఎన్నుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పసుపు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రాబోవు కాలంలో ఆందోళనకు రూపకల్పన చేస్తామన్నారు. జిల్లాలోని పసుపు రైతులను ఐక్యం చేసి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.



ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు ఉపయోగించుకోవాలి

ప్రజాశక్తి-చెన్నూరు

గ్రామీణులు ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలను ఉపయోగించుకుని ఆరోగ్య ంగా ఉండాలని ఫ్యామి లీ ఫిజీషియన్ రాష్ట్ర పరిశీలకులు(నోడల్ ఆఫీసర్) డాక్టర్ రమాదేవి అన్నారు. గురువారం ఆమె మండలంలోని ఉప్పరపల్లె గ్రామం పర్యటించి అక్కడి ఆరోగ్య ఉప కేంద్రాలలో గ్రామీణ పేదలకు వైద్యం సక్రమంగా అందుతుందా, లేదా అని పరిశీలించారు. అక్కడికి వచ్చిన రోగులను ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ అందుబాటులో ఉన్నారా, మీకు సక్రమంగా వైద్య సేవలు అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడి డాక్టర్లకు, సిబ్బందికి సూచనలిస్తూ రోగులకు సంబంధించిన ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులలో వివరాలను నమోదు చేయాలని పేర్కొన్నారు. రోగులకు సంబంధించిన అన్ని పరీక్షలు నిర్వహించి రిపోర్టులను కూడా వారికి తెలియజేసి, రికార్డులలో పొందుపరచాలని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేసే దిశగా వైద్య సిబ్బంది అడుగులేయాలని తెలిపారు. అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలలు పరిశీలించి అక్కడి పిల్లలకు వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకునేందుకు ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు.. ఆమె వెంట మండల వైద్యాధికారి డాక్టర్ బి చెన్నారెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.



గర్భిణులను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

రక్తదాతలకు ధన్యవాదాలు

కడప అర్బన్ : బ్లడ్2లివ్ రక్తదాన వారోత్సవాలలో భాగంగా ఏడు రోజుల పాటు నిర్వహించిన రక్తదాన శిబిరంలో 123 మంది రక్తదానం చేశారని వారందరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపకులు పవన్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం నగరంలోని అప్సర సర్కిల్లో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ మండుటెండలో రోగులను కాపాడేందుకు తాను పడుతున్న కష్టంలో రిమ్స్ బ్లడ్ బ్యాంకు సిబ్బంది కూడా పాలుపంచుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రిమ్స్ బ్లడ్ బ్యాంకు డాక్టర్ ప్రవీణ్, టెక్నిషియన్లు జయచంద్రారెడ్డి, హరి భాస్కర్, పద్మ, పుల్లయ్య, హరి, ఈశ్వర్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె

జగనన్న కాలనీపై ప్రత్యేక దృష్టి పెట్టి నిర్మాణ పనులు వేగవంతం చేయాలని కమలాపురం నియోజకవర్గం ప్రత్యేక అధికారి చంద్రమోహన్ పేర్కొన్నారు, గురువారం మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న కాలనీలపె మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండల వ్యాప్తంగా ఉన్న జగనన్న కాలనీల్లో ఇప్పటి వరకు ఎంతవరకు ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, నీరు, విద్యుత్ సౌకర్యం వంటి వాటిపై ఆరా తీశారు. త్వరితగతిన పనులు చేపట్టి ఇంటి నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఏవైనా సాంకేతిక సమస్యలు ఉంటే సత్వరం పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ గంగయ్య, ఎంపిడిఒ రవికుమార్‌రెడ్డి, హౌసింగ్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి

అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

చెన్నూరు : అభివృద్ధిపై తెలుగుదేశం నాయకులు మాట్లాడడం హాస్య స్పదంగా ఉందని, వైసిపి కమలాపురం నియోజకవర్గం మైనార్టీ కన్వీనర్ అన్వర్‌బాష అన్నారు, గురువారం ఆయన చెన్నూరులో విలేకరులతో మాట్లాడుతూ కొంతమంది టిడిపి నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతుంటే బాధేస్తుందని చెప్పారు. అలాంటివారు నిజా నిజాలు తెలుసుకొని మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. తెలుగుదేశం హయాంలో మైనార్టీలకు ఎంత మాత్రం గౌరవం ఇచ్చారు తెలుసుకొని మాట్లాడాలన్నారు. తెలుగుదేశంలో మైనార్టీలు, ఎమ్మెల్యేలుగా ఉన్నప్పటికీ ఏ ఒక్కరికీ మంత్రి పదవి ఇచ్చిన దాఖలాలు లేవని వాపోయారు. హజ్ హౌస్‌ను కేవలం టిడిపి కమీషన్ల కోసమే నిర్మించారని, మైనార్టీలకు ఏవిధంగా ఉపయోగపడడం లేదని పేర్కొన్నారు. కీ.శే. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి ఉన్న సమయంలో మైనార్టీలకు రిజర్వేషన్లు కల్పించడమే గాక మైనార్టీ పక్షపాతిగా ఉన్నారని, ఇప్పుడు ఆయన తనయుడు ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దుల్హన్ పథకం ద్వారా రూ. లక్ష ఇస్తున్నారని పేర్కొన్నారు. కమలాపురం శాసనసభ్యులు పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి నిత్యం ప్రజలలో ఉంటూ, ప్రజా సమస్యలు వింటూ ప్రజా ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కార మార్గం చూపుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా టిడిపి నాయకులు ప్రభుత్వంపై బురద చల్లడం మానుకోవాలని పేర్కొన్నారు.

రిమ్స్‌లో మానసిక రోగి మృతి

- వైద్యుల నిర్లక్ష్యంతో చనిపోయాడని మృతుడి భార్య ఆరోపణ
- ఆర్ఎంఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి-కడప అర్బన్

నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (రిమ్స్)లో మానసిక రోగి మృతిచెందాడు. వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే మృతిచెందాడని మృతుడి భార్య ఆరోపించి ఆర్ఎంఒకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. మైదుకూరు మండలం శెట్టివారిపల్లెకు చెందిన ఎం. కిరణ్‌కుమార్ (32) పీజీ వరకు చదివారు. కొంత కాలం నుంచి మానసిక అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే చికిత్స తీసుకుంటున్నారు. ఈనెల 1న మోతాదుకు మించి మందులు తీసుకోవడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. వెంటనే అతని కుటుంబ సభ్యులు మెరుగైన చికిత్స నిమిత్తం ఈనెల 2న రిమ్స్‌లో చేర్పించారు. గురువారం ఎం ఐసియు విభాగంలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. ఇదీలా ఉండగా తన భర్త అదరినీ కళ్లు తెరచి చూశాడని, ఎలాంటి అనుభవం లేని జూనియర్ డాక్టర్లు వైద్యం చేయడంతో మృతిచెందాడని మృతుడి భార్య ఎం. రేష్మ ఆరోపించారు. ఈ మేరకు ఆమె ఆర్ఎంఒ డాక్టర్ శ్రీనివాసులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్ఎంఒ సంఘటనపై సమగ్రంగా విచారిస్తామన్నారు.



ఆర్ఎంఒకు ఫిర్యాదు చేస్తున్న మృతుడి భార్య

హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉద్యోగ అవకాశాలు

కడప అర్బన్ : దేశ, విదేశాలలో హోటల్ మేనేజ్‌మెంట్‌లో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని బ్యాచిలర్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీ డైరెక్టర్ గిరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం హోటల్ మెనేజ్‌మెంట్ అభ్యసించిన విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారని తెలిపారు. ఆకర్షణీయమైన జీతంతో తీసుకుంటున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు హోటల్ మేనేజ్మెంట్ చేసిన తరువాత టూరిజం అనుబంధ సంస్థలతో పాటు ఎయిర్‌లైన్స్, రైల్వేస్, క్రూజ్ షిప్పింగ్ పరిశ్రమల్లో మంచి ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని తెలిపారు. నైపుణ్యం కలిగిన విద్యార్థులు సర్వీస్ ఇండస్ట్రీలో అవకాశాలు, ఐటీ బ్యాంకింగ్, ఆస్పత్రి ఈవెంట్ మేనేజ్మెంట్, అడ్వర్‌టైజ్‌మెంట్ మార్కెటింగ్ సంస్థలలో మంచి అవకాశాలు పొందుతున్నారని పేర్కొన్నారు. ఏయిర్ ఫోర్స్, నేవిలో కూడా మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. బ్లూమ్స్ కాలేజ్ ఆఫ్ హోటల్ మేనేజ్మెంట్ 1994లో స్థాపించిన సంస్థలో వేలాది మంది విద్యార్థినీ, విద్యార్థులు విదేశాలలో మన భారతదేశంలో వివిధ హోదాల్లో ఉద్యోగాలు చేస్తున్నారని తెలిపారు. మూడు సంవత్సరాల డిగ్రీ కోర్సు, 10, ఇంటర్, తర్వాత అతి తక్కువ ఫీజుతో విద్యార్థులకు 2023-24 సంవత్సరానికి అడ్మిషన్స్ జరుగుతున్నాయని పేర్కొన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులకు డిప్లొమా, డిగ్రీ పాయిన విద్యార్థులకు పి.జి. డిప్లమా కోర్సులు అందిస్తున్నామని తెలిపారు. కాలేజ్ (బ్లూమ్స్ కాలేజ్) ఉస్మానియా యూనివర్సిటీ అనుబంధంగా, జెఎన్‌టియు అనుబంధంతో నడుస్తున్నదని పేర్కొన్నారు. చదువుతో పాటు ఉద్యోగం విద్యార్థులు పొందవచ్చని తెలిపారు. వివరాలకు 7337228820, 9966742488 సంప్రదించాలని పేర్కొన్నారు.

చల్లా వెంకటసుబ్బారెడ్డికి సన్మానం

చెన్నూరు : మండలంలోని ఓబులంపల్లికి చెందిన చల్లా వెంకటసుబ్బారెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర చిన్న పరిశ్రమల శాఖ డైరెక్టర్‌గా నియమించింది. ఈ సందర్భంగా గురువారం ఆయన్ను మండల ఎంపిపి కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్.వి. నారాయణరెడ్డి, శివాల్‌పల్లె సర్పంచ్ సుదర్శన్‌రెడ్డి, నాయకులు పిచ్చయ్య, శ్రీనివాసలు, కుమార్‌రెడ్డి, రబ్బు పాల్గొన్నారు.

పిహెచ్‌సిని యథాతథంగా కొనసాగించాలి

చెన్నూరు : స్థానిక పిహెచ్‌సిని కడప అక్కాయపల్లె పిహెచ్‌సిలో కలపడం సరికాదని, దీని వల్ల అనేక ఇబ్బందులు వస్తాయని, యథాతథంగా కొనసాగించాలని ఎంపిపి చీర్ల సురేష్‌యాదవ్, రైతు సంఘం నాయకులు ఎర్రసాని మోహన్‌రెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు ఎస్.వి. నారాయణరెడ్డి, చిన్న పరిశ్రమల డైరెక్టర్‌చల్లా వెంకటసుబ్బారెడ్డి, శివాల్‌పల్లె సర్పంచ్ ఉమ్మడి సుదర్శన్ రెడ్డి, రావణపల్లె సర్పంచ్ దీపం స్వప్న కోరారు. గురువారం వారు డిఎంహెచ్ఒ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. పిహెచ్‌సిని తరలించడం వల్ల చెన్నూరు వాసులు చాలా ఇబ్బందులు పడుతారని, వారి సమస్యను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం ఉన్న చోట్లనే కొనసాగించాలని కోరారు.

నేటి నుంచి సెమిస్టర్ పరీక్షలు

కడప అర్బన్ : నగంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 5 నుంచి 16 వరకు 6వ సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు విశ్వవిద్యాలయ విసి, పరీక్ష నియంత్రిక అధికారి ఆచార్య బి.అంజనేయ ప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సురేంద్రనాథ్ రెడ్డి ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. స్కూల్ ఆఫ్ ప్లానింగ్‌లోని డిజిటల్ టెక్నిక్యూస్ ఇన్ డిజైన్ అండ్ ప్లానింగ్, ఇంటీరియర్ డిజైన్, కాలేజ్ అఫ్ ఫైన్ ఆర్ట్స్‌లోని పెయింటింగ్, ఫొటోగ్రఫీ, అప్లైడ్ ఆర్ట్, యానిమేషన్ విభాగాలకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

పరీక్షల విభాగం వెబ్‌సైట్ ప్రారంభం

కడప అర్బన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విభాగ వెబ్‌సైట్‌ను విశ్వవిద్యాలయ విసి ఆచార్య జింక రంగ జనార్ధన్, రిజిస్ట్రార్ ఆచార్య వై. పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ కృష్ణారెడ్డి, పరీక్షల నిర్వహణ అధికారి ఆచార్య ఎన్. ఈశ్వర్ రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. విశ్వవిద్యాలయ పరిధిలో అన్ని కళాశాలల విద్యార్థుల పరీక్షలకు సంబంధించి అప్‌డేట్ సమగ్ర సమాచారం అందుబాటులోకి తీసుకువస్తూ వెబ్‌సైట్‌ను వైవీయూ ఐటీ హబ్ సంచాలకులు ఆచార్య ఎం.వి.శంకర్ ఆధ్వర్యంలో రూపకల్పన చేశారు.

పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

కడప అర్బన్: విద్యాశాఖ ఆదేశాలను అమలు చేయకుండా సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి రాఘవరెడ్డికి ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం పిర్యాదు చేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యదర్శి సగిలి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు ప్రభుత్వం, విద్యాశాఖ వేసవి సెలవులు ప్రకటించిందని పేర్కొన్నారు. జిల్లాలోని కార్పొరేట్, ప్రయివేట్ పాఠశాలలు విద్యాశాఖ ఆదేశాలను ఏమాత్రం పట్టించుకోకుండా బేఖాతరు చేస్తూ పాఠశాలలకు సెలవులు ఇచ్చినప్పటికీ యధేచ్ఛగా తరగతులు నిర్వహిస్తున్నాయని తెలిపారు. విద్యాసంవత్సరం ప్రారంభం కాకుండానే అక్రమంగా అడ్మిషన్స్ కూడా నిర్వహిస్తున్నాయని చెప్పారు. సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తూ అక్రమంగా అడ్మిషన్స్ నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవడంలో జిల్లా విద్యాశాఖ అధి కారులు పూర్తిగా విఫలం చెందారని విమర్శించారు. విద్యాశాఖ ఆదేశాలను అమలు చేయని పాఠశాలలకు జిల్లా విద్యాశాఖ అధికారులు కొమ్ముకాస్తున్నారని పేర్కొన్నారు. విద్యాశాఖ ఆదేశాలను పాటించని పాఠశాలలపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు గండి. సునీల్ కుమార్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

కడప అర్బన్ : వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉన్న కమాండ్ కంట్రోల్ విభాగాన్ని నూతన డిఎస్‌పి ఎం.డి.షరీఫ్ గురువారం పరిశీలించారు. నగర పరిధిలో ఎన్ని కెమెరాలు ఉన్నాయి, ఏ విధంగా పనిచేస్తున్నాయనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరాల శోధనలో నిఘా కెమెరాల అవసరం అత్యవసరమని తెలిపారు. ఎల్లవేళలా పర్యవేక్షిస్తూ ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. తనిఖీలో కడప వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ హాసం, వన్ టౌన్ ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలిస్తున్న డిఎస్పి షరీఫ్

నిరుద్యోగులూ.. మోసపోవద్దు

కడప అర్బన్: జాతీయ ఆరోగ్య సంస్థలో డాక్టర్ పివైఎ ఖాన్ పర్యవేక్షణలో డేటా సూపర్‌వైజర్ ఉద్యోగాలు మహిళల కోసం కడప అర్బన్, రూరల్, ఖాజీపేట, బద్వేలు, ప్రొద్దుటూరు, కమలాపురంలో ఉన్నాయని మోసపూరిత సమాచారం ప్రచారం చేస్తూ ఉన్నారని వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మోసపూరిత సమాచారాన్ని నమ్మి నిరుద్యోగులు డబ్బులు ఇచ్చి మోసపోవద్దని తెలిపారు. జాతీయ ఆరోగ్య సంస్థలో నిర్వహించే ఉద్యోగాల ఎంపికలు కలెక్టర్ పర్యవేక్షణలో ఉంటాయని పేర్కొన్నారు. మోసపూరిత సమాచారం తెలిసినట్లయితే జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

కర్ణాటకలో కాంగ్రెస్ విజయం తథ్యం

ప్రజాశక్తి - కడప

కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం తథ్యం అని ఆంధ్రప్రదేశ్ యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యూత్ జోడో బూత్ జోడో రాష్ట్ర కో- ఆర్డి నేటర్ నందిమండలం విజయ్ సుశీల్‌కుమార్ అన్నారు. గురువారం ఆయన బెంగుళూరు అర్బన్ గాంధీనగర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. సందర్భంగా మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తప్పక ఘనవిజయం సాధిస్తుందన్న పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కర్ణాటక ఎన్నికలు కాంగ్రెస్ భవిష్యత్తు విజయాలకు ఒక మైలురాయిగా మారుతుంది అని అన్నారు. ఈ విజయం జాతీయ స్థాయిలోనూ పార్టీ పుంజుకునేందుకు దోహదం చేస్తుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి విన్సి జాన్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొర్ల పవన్ కుమార్ పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న విజయ్ సుశీల్‌కుమార్

104 సేవలను సద్వినియోగం చేసుకోవాలి

కలసపాడు : 104 సేవలను సద్వినియోగం చేఉకోవాలని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్, కె. సాయి తేజ అన్నారు. గురువారం లింగారెడ్డిపల్లె సచివాలయంలోని హెల్త్ సెంటర్‌లో ఆయన రోగులతో మాట్లాడుతూ ప్రతి నెలా 4వ తేదీన 104 సేవలు లింగారెడ్డిపల్లె సచివాలయం వద్దకు వస్తుందని, బిపి, షుగర్, గర్భిణులకు, బాలింతలకు వైద్య పరీక్షలు చేస్తారన్నారు. చిన్నారులకు టీకాలు కూడా వేస్తారని తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీనివాసులు, సూపర్‌వైజర్ సావిత్రి, ఎఎన్ఎం కన్నమ్మ,, వెంకటసుబ్బయ్య ఎంపిహెచ్ఎ, ఆశా వర్కర్లు జి. గురమ్మ , జె. రాములమ్మ, కె. లక్ష్మిదేవి, .జి. లక్ష్మిదేవి పాల్గొన్నారు.

4వ రోజు జెవివి వేసవి వినోదం

కడప అర్బన్ : జన విజ్ఞాన వేదిక యువ నాయకులు సత్యనారాయణరెడ్డి మూడవ వర్ధంతి వేసవి వినోదంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ సత్యనారాయణ కెమిస్ట్రీ లెక్చరర్‌గా పని చేస్తూ తన భోధనతో యువకులను ఆకట్టుకునేవారని చెప్పారు. జనవిజ్ఞాన వేదికలో యూత్ ఏ విధంగా ఉండాలి, సైన్స్ పట్ల ఎటువంటి అవగాహన కలిగి ఉండాలనే వాటి మీద తన విద్యార్థులను పదుల సంఖ్యలో అన్ని జిల్లాల్లో తయారు చేశారని తెలిపారు. ప్రస్తుతం 50 మంది యువత జన విజ్ఞాన వేదికలో ముఖ్యమైన బాధ్యతల్లో ఉంటూ సైన్స్ ప్రచారంలో పాల్గొంటున్నారంటే అది ఆయన ఘనతే అన్నారు. సత్యనారాయణరెడ్డి నిరాడంబరంగా ఉంటూ, విద్యార్థులకు కెమిస్ట్రీ బోధిస్తూ, పేద విద్యార్థులను చదివిస్తూ తన జీవితాన్ని వారి కోసమే త్యాగం చేసిన మేధావని చెప్పారు. వేసవి వినోదంలో డాన్స్, పాటలు, సైన్స్ ప్రయోగాలు చేసి బోధించారు. విద్యార్థులకు ఆపిల్ కన్న అరటి మిన్న అని తెలియజేసేటట్లు అరటి పండును స్నాక్‌గా ఇచ్చారు. కార్యక్రమంలో ఎపిజిబి ప్రధాన కార్యదర్శి జగదీష్, జెవివి ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, చెకుముకి కన్వీనర్ కిరణ్, యూత్ లీడర్ మధుసూదన్, సమతా నాయకురాలు కామేశ్వరమ్మ, డాన్స్ మాస్టర్లు పాల్గొన్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ షేక్ గౌస్‌బాషా

వక్ఫ్ బోర్డ్‌కు మాత్రమే అద్దెలు చెల్లించాలి

- వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ షేక్ గౌస్‌బాషా

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - జమ్మలమడుగు

పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో సర్వేనెంబర్ 402ఎలో ఉన్న దుకాణదారులు అందుకు సంబంధించిన అద్దెలు వక్ఫ్ బోర్డ్‌కు మాత్రమే చెల్లించాలని కడప జిల్లా వక్ఫ్ బోర్డ్ ఇన్‌స్పెక్టర్ షేక్ గౌస్ బాషా తెలిపారు. 'ప్రజాశక్తి' దినపత్రికలో గురువారం 'వక్ఫ్‌బోర్డు స్థలాలు అన్యాక్రాంతం' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు అధికారులు స్పందించారు. ఆ మేరకు గురువార వారు ఆ స్థలంలో ఉన్న దుకాణదారులతో ఇన్‌స్పెక్టర్ షేక్ గౌస్‌బాషా, షేక్ ఉస్మాన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌస్‌బాషా మాట్లాడుతూ ప్రతినెల వక్ఫ్ బోర్డ్ అధికారులకు అద్దెలు చెల్లించాలన్నారు. పాత కమిటీ సభ్యులకు ఎవరికీ అద్దెలు చెల్లించరాదన్నారు. అలా ఎవరైనా కమిటీ సభ్యులకు చెల్లిస్తే వాటిని పరిగణలోకి తీసుకోబోమని తెలిపారు. ఇకపై వక్ఫ్‌బోర్డ్ స్థలంలో ఎలాంటి దుకాణాలు పెట్టుకోవాలన్నా సంబంధిత అధికారుల అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. అలా కాకుండా ఎవరైనా దుకాణాలు పెట్టుకుంటే వారిపై సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా దుకాణాలు ఏర్పాటు చేసుకోవాలంటే కడప వక్ఫ్ బోర్డ్ కార్యాలయంలో అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

వాలంటీర్ల నియామకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని ఖాళీగా ఉన్న ఆయుదు వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంపిడిఒ శ్రీధర్‌నాయుడు తెలిపారు. మండలంలోని నాగులపల్లె, ఖాదర్‌పల్లె, వెదురూరు, సోమాపురం, మదూరు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వాలంటీర్లను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. శుక్ర, శనివారాల్లో దరఖాస్తులు స్వీకరిస్తామని, 7న వాటి పరిశీలన, 8,9న ఇంటర్వ్యూలు నిర్వహించి, 10న ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన వారికి 11న శిక్షణనిస్తామని ఆయన వివరించారు.

ప్రజాసేవతో రాజకీయాల్లో రాణించాలి

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు



మాట్లాడుతున్న కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి

రాజకీయాల్లో ఎదగాలంటే ప్రజాసేవే ఉత్తమ మార్గమని, ఇది తెలియని టిడిపి ఇన్‌ఛార్జి ప్రవీణ్ కుమార్‌రెడ్డి నిరాధారమైన ఆరోపణలతో ఉనికిని కాపాడు కోవాలని చూసుకోవడం కేవలం భ్రమే అవుతుందని వైసిపి కౌన్సిలర్ వరికూటి ఓబులరెడ్డి హితవు పలికారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్థానికంగా నూతన మార్కెట్ నిర్మాణంలో నిరాధారమైన ఆరోపణలు చేయడం తగదన్నారు. విద్వేషాలు రెచ్చగొట్టేలా విష్షప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రొద్దుటూరుకు చెందిన గుత్తేదారు తన ఊరిలో తనకు మంచిపేరు రావాలనే ఉద్దేశంతో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తాను అనే హామీతోనే కూరగాయల మార్కెట్ నిర్మాణ పనులు అప్పగించామన్నారు. ప్రస్తుతానికి కేవలం మట్టిని తవ్వే పనులు మాత్రమే జరుగుతుండగా, అప్పుడే నాణ్యత గురించి మాట్లాడడం అవగాహనారాహిత్యం అన్నారు. ఇప్పుడు తవ్వే మట్టి కొంత వరకు రైతులకు కూడా ఉపయోగపడుతోందన్నారు. అప్పుడే టిడిపి అధికారంలోకొచ్చినట్లు కలలు కంటూ బెదిరింపులకు దిగడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గానికి టిడిపి టికెట్ ఆశించేవారి సంఖ్య పెరుగుతున్నందున ప్రవీణ్‌కు టికెట్ వస్తే అమ్ముడుపోయే రకం అని ఆరోపించారు. కొత్తగా వచ్చిన సురేష్ నాయుడు సేవా కార్యక్రమాలతో టిడిపి టికెట్‌ను ఆశిస్తుండడం సబబే అన్నారు. ఇలాంటి కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు ప్రజాసేవ ద్వారా రాజకీయాల్లో ఎదుగుతున్నారని వరికూటి ఓబులరెడ్డి పేర్కొన్నారు.

ఆక్రమణల తొలగింపునకు సహకరించండి

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల-రాయచోటి బైపాస్ రోడ్డులో ఉన్న ఆక్రమణలను తొలగింపునకు ఇళ్ల యజమానులు సహకరించాలని తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. గురువారం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ స్థల, గృహ యజమానులతో వెడల్పు పనులపై చర్చించారు. గతంలో రోడ్డు విస్తరణ 100 అడుగుల నిర్ణయించి స్థల, గృహ యజమానులకు ప్రభుత్వం డబ్బులు కూడా చెల్లించిందన్నారు. అయినప్పటికీ లబ్దిదారులు అందరూ మళ్లీ రోడ్డుపై ఆక్రమ కట్టడాలు నిర్మించారన్నారు. రోడ్డుపై ఉన్న ఆక్రమ నిర్మాణాలను లబ్దిదారులు తొలగించాలని కోరారు. ఆక్రమణలు తొలగిస్తే అండర్ డ్రయినేజీ పనులు చేసేందుకు వీలుంటుందన్నారు. త్వరగా వాటిని తొలగించాలని తహశీల్దార్ కోరారు.



ఇళ్ల యజమానులతో చర్చిస్తున్న తహశీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి

క్రైం కార్నర్

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇరువురికి గాయాలు

ప్రజాశక్తి - పోరుమామిళ్ల

మండలంలోని కలువ కట్ట ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి వ్యక్తి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. గురువారం మధ్యాహ్నం అక్కలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన రామయ్య పోరుమామిళ్ల నుండి ఇంటికి వెళుతున్న సమయంలో ప్రధాన రహదారిపై బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



గాయపడిన రామయ్య

ద్విచక్ర వాహనం, కారు ఢీకొని మరొకరు..

అట్లూరు : అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాలిశెట్టి గంగయ్య తీవ్రంగా గాయపడ్డాడు. బెంగళూరు నుండి పెంచలకోనకు బయలుదేరిన కారు అట్లూరు క్రాస్ రోడ్డు వద్ద ఎస్.వెంకటాపురం గ్రామానికి చెందిన గాలిశెట్టి గంగయ్య బైక్ ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. అట్లూరు పోలీసులు గంగయ్యను హాస్పిటల్ కి తరలించి కేసు నమోదు చేసి విచారిస్తున్నామని తెలిపారు.

ప్రొద్దుటూరులో ట్రాఫిక్ అస్తవ్యస్తం

అలంకార ప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ - పట్టని అధికారులు





పద్మవ్యూహాన్ని తలపిస్తున్న ట్రాఫిక్, అలంకార ప్రాయంగా సిగ్నల్ వ్యవస్థ

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

రాష్ట్రంలోనే ప్రొద్దుటూరు వాణిజ్యకేంద్రంగా రాణిస్తోంది. బంగారు, వస్త్ర, మండీ, మందులు, మిల్లులు, రియల్ ఎస్టేట్ ఇలా ప్రతి రంగంలో నిత్యం రాణిస్తూనే ఉంది. ఏదో ఒక పని చేసుకొని బతకొచ్చు అనే ఆలోచనతో ఇక్కడ నివాసమేర్పరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రోజురోజుకు పట్టణ జనాభా పెరుగుతోంది. అదే తరహాలో ట్రాఫిక్ సమస్య కూడా పెరుగుతోంది. మహిళలు, పిల్లలు, వృద్ధులు బయటకు రావాలంటేనే ట్రాఫిక్‌తో హడలిపోతున్నారు. ఈ పరిస్థితుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించే ఉద్దేశంతో రెండేళ్ల క్రితం వన్‌టౌన్ సర్కిల్ నుండి శివాలయం సర్కిల్ వరకు ఆరు సిగ్నల్ వ్యవస్థను మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు. వన్‌టౌన్ సర్కిల్, వినాయకనగర్, విజయకుమార్ సర్కిల్, వైయంఆర్ కాలనీ సర్కిల్, రాజీవ్ సర్కిల్, శివాలయం సర్కిల్‌లో సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. ఇవి ఒక నెల మాత్రమే పనిచేశాయి. అనంతరం అలంకారప్రాయంగా మిగిలిపోయాయి. పట్టణంలో ఎక్కడ కూడా పార్కింగ్ ప్రదేశాలు లేవు. గాంధీరోడ్డు, కెకె వీధి, దర్గా బజార్, టిబి రోడ్డు, మైదుకూరు రోడ్డు, ఔరేషన్ నుండి అమ్మవారిశాల రోడ్డు, బంగారు అంగళ్ల రోడ్డు ఎప్పుడూ రద్దీగా ఉంటాయి. ప్రధానరోడ్లలో డివైడర్‌లు ఏర్పాటు చేసినా ఆ నిబంధనలను ఎవరూ పాటించడంలేదు. ముఖ్యంగా యువత పెట్రేగిపోతోంది. సెల్‌ఫోన్ రైడింగ్, త్రిబుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్ అధికమైంది. పట్టణంలో 40 ఏళ్లు దాటిన వారు బైక్ నడపాలంటే వెనక నుండి ఎవరొచ్చి ఢీకొడతారోనని బెంబేలెత్తిపోతున్నారు. పట్టణంలో మాస్టర్ ప్లాన్ అమలు కాకపోవడంతో రోడ్లు బాగా కుచించుకుపోయాయి. సిగ్నల్ వ్యవస్థ గురించి మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యను వివరణ కోరగా.. 'వాళ్లకు ఎన్ని సార్లు చెప్పినా రావడం లేదు' అని ముక్తసరిగా సమాధానమిచ్చారు. ట్రాఫిక్ వ్యవస్థపై ట్రాఫిక్ సిఐ యం.యుగంధర్ మాట్లాడుతూ రోడ్లపై బార్డర్ లైన్స్ వేసి సూచిక బోర్డులను రాయాల్సి ఉందన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రోడ్ల విస్తీర్ణం చేయాలన్నారు. సిగ్నల్ లైట్ల నిర్వహణ క్రమం తప్పకుండా జరగాలన్నారు. వీటన్నిటిపై మున్సిపల్ కార్యాలయంలో పలు మార్లు రాత పూర్వకంగా అభ్యర్థించామని తెలిపారు. సెల్‌ఫోన్, త్రిబుల్, స్పీడ్ రైడింగ్‌పై ప్రత్యేకదృష్టి పెట్టామని సిఐ వివరించారు.

బయటికి రావాలంటేనే భయం



ఇంటి నుంచి బయటకు రావాలంటే పట్టణంలో ట్రాఫిక్ భయపెడుతోంది. వాహనదారులు నిబంధనలు పాటించక పోవడంతో అస్తవ్యస్తంగా తయారైంది. ఒక బండి వెనుక మరో బండి వస్తే సమస్య ఉండదు. అక్కడా కూడా ఆధిపత్యం చూపాలంటారు. ఈ సమస్యపై అధికారులు దృష్టి పెట్టాలి.

-షేక్ సలీం, వ్యాపారి

నో ట్రాఫిక్‌డేను పాటించాలి



పట్టణంలో 40 ఏళ్లనాటి రోడ్లు అలాగే ఉన్నాయి. జనాభా మాత్రం ఊహించని రీతిలో పెరు గుతోంది. అట్లే వాహనాలు కూడా ఎక్కువయ్యాయి. ఢిల్లీ తరహాలో వారంలో ఓ రోజు అందరికీ ఆమోద యోగ్యంగా 'నో ట్రాఫిక్‌డే'ని పాటిస్తే సమస్య కొంత వరకైనా పరి ష్కారం అవుతుంది.

- ఉప్పర మురళీధర్, స్వర్ణకారుల సంఘం అధ్యక్షులు

డ్రైయినేజీ పనులు ప్రారంభం

ప్రజాశక్తి - చాపాడు

మైదుకూరు మున్సిపాలిటీ పరిధి 12వ వార్డు ప్రజలకు ఇచ్చిన మాట మేరకు రూ.15 లక్షలతో డ్రైయినేజీ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి తెలిపారు. ఈ పనులకు గురువారం ఆయన భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అన్ని వార్డులను అభివృద్ధి చేస్తామన్నారు. సిమెంట్ రోడ్లు, డ్రైయినేజీ కాలువల నిర్మాణానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో మైదుకూరు మున్సిపల్ ఛైర్మన్ మాచనూరు చంద్ర, వైస్ ఛైర్మన్ షరీఫ్, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, వైస్ ఎంపిపి రఘురామిరెడ్డి, వైసిపి పార్టీ మైదుకూరు పట్టణ అధ్యక్షులు లింగన్న, వైసిపి నాయకులు భరత్‌కుమార్‌రెడ్డి, వైసిపి పట్టణ మహిళా అధ్యక్షురాలు కిరణ్మయి, మునిసిపల్ కమిషనర్, ఎఇ, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, వార్డు ఇన్‌ఛార్జిలు, మునిసిపల్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మోడీ పాలనలో మీడియాకు స్వేచ్ఛ కరువు

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్రంలోని మోడీ పాలనలో మీడియాకు స్వేచ్ఛ కరువైందని, దీంతో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి అన్నారు. గురువారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఫ్రాన్స్‌కు చెందిన ఆర్ఎస్ఎఫ్ అనబడే అంత ర్జాతీయ మీడియా పర్యవేక్షక సంస్థ మీడియా స్వేచ్ఛపై 180 దేశాల్లో సర్వే నిర్వహించగా భారత్‌కు 161వ స్థానం వచ్చిందన్నారు. నార్వే, ఐర్లాండ్, డెన్మార్క్ దేశాలకు వరుసగా 1,2,3 స్థానాలు, పాకిస్తాన్‌కు 150, శ్రీలంకకు 135వ స్థానాలు వచ్చాయని తెలిపారు. చివరకు ఆఫ్ఘనిస్తాన్ కూడా 152వ స్థానంలో భారత్ కంటే మెరుగైన స్థానంలో ఉండడం గమనార్హమన్నారు. ఇప్పటికైనా ప్రజాస్వామ్యవాదులు మేల్కొనాలని తులసిరెడ్డి సూచించారు. పులివెందుల పట్టణం లో సిఎం జగన్ నివాసం ఉండే బాకరా పురం తోపాటు ఎర్రగుడిపల్లె, రోటరీపురంలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులు ప్రారంభించి మూడేళ్ల గడుస్తున్నా పూర్తి కాకపోవడం దురదృష్టకరమని తులసిరెడ్డి విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు జాతీ య ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 90 ప్రకారం హెడ్ వర్క్స్, కాలు వలు, భూసేకరణ, నష్టపరిహారం, చెల్లింపులు, పునరావాస కేంద్రం బాధ్యత అన్నారు. కాంగ్రెసు పార్టీ అధికారంలోకి వస్తేనే పోలవరం పూర్తవు తుందన్నారు.



మాట్లాడుతున్న తులసిరెడ్డి

మట్టి పాత్రల వినియోగం.. బహుళ ప్రయోజనం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

సగటు మనిషి జీవన కుటుంబానికి మట్టి పాత్రలు బహుళ ప్రయోజనాలు కలిగిస్తాయి. ప్రాచీన కాలం నుంచి నేటి నవీన యుగం వరకు మట్టి పాత్రల వినియోగానికే అధిక ప్రాధాన్యతనిచ్చారు. తినే తిండి నుంచి వాడే పాత్ర వరకు మట్టితో తయారు చేసిన పాత్రలోనే వినియోగించేవారు. నేటికీ వాటి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. నేటికీ సమాజంలో పలు కార్యక్రమాలకు మట్టి పాత్రలను వినియోగిస్తున్నారు. కానీ కాల గమనంలో సిల్వర్ పాత్రలు మార్కెట్‌లోకి రావడంతో ఆదరణ తగ్గిందని చెప్పవచ్చు. వీటిపై ఆధారపడి జీవించే పలు శ్రామిక కుటుంబాలు బతుకుదెరువును కోల్పోయాయని చెప్పవచ్చు. ఈ మట్టి పాత్రలను పేదోడి ఫ్రిజ్‌గా పిలుస్తారు. వేసవి రావడంతో మట్టి పాత్రలు మార్కెట్లోకి వచ్చేశాయి. రెండు దశాబ్దాల క్రితం వరకు ప్రతి ఒక్కరూ మట్టి పాత్రలను వినియోగించేవారు. మట్టితో తయారైన పాత్రల ఉపయోగం ఎంతో మంచిదని చెబుతున్నారు. ఈ మట్టి పాత్రలో ఒక సామాజిక వర్గానికి చెందిన వారు ప్రత్యేకించి తయారు చేస్తారు. వీటిని అందంగా 10 కాలాల పాటు పదిలంగా ఉండేందుకు తయారు చేయడంలో ఎంతో పేరు ఉంది. బానలు, కుండలు, కడవలు ఇలా వివిధ రకాల పాత్రలు ఎంతో నైపుణ్యంతో తయారు చేస్తారు. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాలు మట్టి పాత్ర తయారు చేయడంలో పేరుగాంచాయి. కానీ సాంకేతిక పరిజ్ఞానంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకోవడంతో మట్టి పాత్రల వినియోగం చాలా వరకు తగ్గింది. ప్రస్తుత కాల పరిస్థితుల్లో మార్కెట్లో వివిధ రకాల సామగ్రి అందుబాటులోకి రావడంతో మట్టిపాత్రలకు గిరాకీ తగ్గిందనే వాదన కూడా వినవస్తోంది. దీంతో వీటిపై ఆధారపడిన కుటుంబాలకు బతుకుదెరువు కరువైంది. విధిలేని పరిస్థితిలో తరతరాల నుంచి వస్తున్న కుల వృత్తికి స్వస్తిబలికి బతుకుతెరువు కోసం ఇతర మార్గాలను అన్వేషంచాల్సి వచ్చిందని శ్రామికులు చెబుతున్నారు. ప్రాచీన కాలం నుంచి మట్టి పాత్రలకు విశేష ఆదరణ ఉంది. ముఖ్యంగా వేసవిలో తాగునీటి కోసం మట్టిపాత్రలోనే వినియోగించేవారు. గతంలో బాటసారుల దాహార్తి కోసం గ్రామ శివారులో చెట్టుకు భానులను ఏర్పాటు చేస్తారు. మట్టిపాత్రలో నీటిని సేవించడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని పలువురు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో యాంత్రిక జీవనం సాగిస్తున్న సగటు మనిషి ప్రాచీన కాలం నాటి మట్టి పాత్రలను నేటికీ వినియోగిస్తూ ఆదరిస్తున్నారు.



హెల్త్ సెంటర్లలో కమిషనర్ తనిఖీ

పులివెందుల రూరల్ : నగరిగుట్ట, బాకరాపురం, జయమ్మ కాలనీల్లో అధునాతన పరికరాలతో నిర్మించిన డాక్టర్ వైఎస్ఆర్ అర్బన్ హెల్త్ సెంటర్లను మునిసిపల్ కమిషనర్ వి.నరసింహారెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సెంటర్లలో ఒక డాక్టర్, ఇద్దరు హెడ్ నర్సులు, అయిదుగురు ల్యాబ్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటారన్నారు. ఇక్కడ 72 రకాల మందులు, అన్ని రకాల రక్త పరీక్షలు ఉచితంగా చేస్తారన్నారు. ఈ అర్బన్ హెల్త్ సెంటర్లు ఉదయం 9 నుండి సాయంత్రం 4గంటల వరకు పని చేస్తాయని తెలిపారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



హెల్త్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహారెడ్డి

అంతరిస్తున్న ఆహార ధాన్యాల పంటలు

- సాగుకు మొగ్గుచూపని రైతులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

కాలక్రమేణా ఆహార ధాన్యాల పంటలు అంతరిస్తున్నాయి. ఒకప్పుడు రైతులు విరివిగా సాగుచేసిన ఈ ఆహార ధాన్యాల పంటల పట్ల రైతులు కూడా మక్కువ చూపలేకున్నారు. గతంలో పులివెందుల నియోజకవర్గ పరిధిలో 60 నుంచి 70 వేల ఎకరాల్లో కనిపించిన ఈ ఆహార ధాన్యాల పంటలు.. నేడు వందల ఎకరాలకు పరిమితమైంది. ఇందులో ప్రధానంగా జొన్న పంట ఒకటి. రబీ సీజన్‌లో ఈ జొన్న పంట సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు. భారతదేశంలో ఆహారం, దాణా, పశుగ్రాసం కోసం నీటి వనరులు, వర్షాధారంగా జొన్న పంటను వేస్తారు. భారతదేశంలో పండించే ధాన్యపు పంటల్లో జొన్న ఒకటి. ఈ జొన్న పంట దేశంలో నాలుగో స్థానంలో ఉంది. రాయలసీమ ప్రాంతంలో వ్యాపార, వాణిజ్య, కూరగాయల, ఉద్యాన పంటలతోపాటు ఆహార ధాన్యాల పంటల సాగుకు ఈ ప్రాంతం సంబంధించి నేలలు మిక్కిలి అనుకూలిస్తాయి. చిరుధాన్యాల వల్ల బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ముఖ్యంగా బిపి, షుగర్ వంటి దీర్ఘ కాలిక రోగులకు ఈ చిరుధాన్యాలు దివ్య ఔషధంలా పని చేస్తాయని వైద్యులు చెబుతున్నారు. ఒకప్పుడు చిరు ధాన్యాలను రైతులు ప్రత్యేకించి పాత్రలు తయారు చేసుకుని వాటిలో దాచుకునేవారు. కరువు కాటకాలు సంభవించిన సమయాల్లో ఈ ధాన్యాలను ఉపయోగించుకునేవారు. దీంతో ఆహార సమస్య తలెత్తేది కాదని పలువురు రైతులు చెబు తున్నారు. గతంలో ఈ చిరుధాన్యాలు వస్తు మార్పిడి కూడా చేసుకునేవారు. ఎప్పుడైతే కిలో బియ్యం రెండు రూపాయలు వంటి పథకాలు అమలులోకి వచ్చాయో అప్పటి నుండి ఈ చిరుధాన్యాల పంటల సాగు తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం పులివెందుల నియోజకవర్గ పరిధిలో ఈ జొన్న పంట కేవలం 20 శాతం మాత్రమే సాగు చేసినట్లు తెలుస్తోంది. ఎంతో పోషక విలువలు కలిగిన ఈ చిరుధాన్యాల పంటలను సాగు చేసేందుకు రైతులకు తగిన సహాయ సహకారాలు అందించి మళ్లీ ఈ పంటలు విరివిగా సాగయ్యేలా చూడాలని పలువురు సూచిస్తున్నారు.



సాగులో ఉన్న జొన్న పంట



కెసి కాలువలో ఆగిపోయిన నీరు

కెసి కాలువకు ఆగిన నీరు

ప్రజాశక్తి - చాపాడు

కెసి కాలువలో నీటి సరఫరా ఆగిపోయింది. ఈ ఏడాది మార్చి 30 వరకు నీటిని విడుదల చేస్తామని అధికారులు ముందుగా ప్రకటించినప్పటికీ మే మెదటి వారం వరకు నీరు ప్రవహించింది. మే మొదటి వారం వరకు కెసి కాలువకు నీరు రావడం చాలా అరుదు అని రైతులు పేర్కొంటున్నారు. కెసి కాలువ పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో వరి పంట పూర్తయిన తర్వాత రెండవ దఫా వరి, మినుము, నూగు, మొక్కజొన్న వంటి పంటలు రైతులు సాగు చేసి ప్రస్తుతం నూర్పిడి చేస్తున్నారు. పంటలు పూర్తి కావడంతో కెసి కాలువకు అధికారులు నీటిని నిలిపేశారు. గత ఖరీఫ్‌లో ఆగస్టు మొదటి వారంలో కెసికి నీటిని విడుదల చేశారు. అప్పటి నుండి ఇప్పటి వరకు నీరు వచ్చింది. ఈ ఏడాది కెసి కెనాల్ పరిధిలో సాగైన వరి పంట దిగుబడి కూడా ఆశాజనకంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు.



కరపత్రాలు పంచుతున్న జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

వైసిపి ప్రభుత్వంలో ప్రజలకు ఇబ్బందులు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైసిపి మూడున్నరేళ్ల పాలనలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతుంటే, మరోవైపు నిత్యవసర ధరలను అమాంతంగా పెంచడంతో ప్రజలు ఇదేం కర్మ అంటూ ప్రశ్నిస్తున్నారని టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పట్టణ పరిధిలో రిలయన్స్ పెట్రోల్ బంక్ వద్ద నుండి మైదుకూరు రోడ్డు షాపింగ్ కాంప్లెక్స్‌లో ఆయన ఇదేం కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రజలంతా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో ప్రొద్దుటూరు పట్టణ అధ్యక్షుడు ఇవి సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ముక్తియార్, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సుంకర వేణుగోపాల్, 14వ వార్డు మస్తాన్ గోలే, గోపవరం గౌస్, భగత్‌సింగ్ కాలనీ పట్నం మాబాషా, శివ, పగిడాల కన్నయ్య, మహేష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



రోడ్డును శుభ్రం చేయాలని అధికారులకు సూచిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పెద్దపసుపులలో ఎమ్మెల్యే పర్యటన

ప్రజాశక్తి - పెద్దముడియం

మండల పరిధిలోని పెద్ద పసుపుల గ్రామంలో గురువారం ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఎస్సీ కాలనీలో ఆయన ప్రతి ఇల్లు తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు గురించి వివరించారు. అర్హులకు అందుతున్నాయా అని ఆరా తీశారు. కొంతమంది మహిళలు రోడ్లపై నిలిచిన వర్షపునీటిని చూపుతూ ఈ మురికి నీటి వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. వెంటనే గ్రామ కార్యదర్శి శ్రీనివాసును పిలిచి తక్షణమే నీటిని తోడించి రోడ్డును శుభ్రపరచాలని ఆదేశించారు. బండెల మరియమ్మ పాత ఇంట్లో రెండు కుటుంబాలు ఉన్నామనయని, వారికి వెంటనే ఇల్లు మంజూరు చేయాలని ఎమ్మెల్యే హౌసింగ్ ఎఇ సుబ్బరాయుడుకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎస్ఐ శ్రీనివాసులు, వీఆర్వోలు, ఆరోగ్య సిబ్బంది, వైసిపి కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

టిడిపిలో 50 కుటుంబాలు చేరిక

ప్రజాశక్తి - పెద్దముడియం

మండలంలోని చిన్నముడియం, గులవలూరు గ్రామాల్లో గురువారం జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాలకు చెందిన 50 కుటుంబాలు భూపేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ శివనాథరెడ్డి అధ్వర్యంలో చేరాయి. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. లక్కిరెడ్డి పురు షోత్తంరెడ్డి(వైస్ ప్రెసిడెంట్), లక్కిరెడ్డి రామసుబ్బమ్మ(వార్డ్ మెంబర్), గూడ రామలింగారెడ్డి (వార్డ్ మెంబర్), లక్కిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేరారు. గర్షలూరు గ్రామంలోని ఈదుల హుస్సేన్ రెడ్డి, గుండాల సుధాకర్, చంటి, సాల్మన్, ఏసురత్నం, పత్తూరి ఓబులేష్, సాదు, ఆనందరావు, మార్క్, ఏసన్న, రత్నం టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ తనపై, పార్టీ అధినాయకత్వంపై నమ్మకంతో పార్టీలోకి చేరిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. నమ్మి వచ్చిన వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, జమ్మలమడుగు పార్టీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నవ నీశ్వర్‌రెడ్డి, రాయల్ కిరణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, తులసిరెడ్డి, నరసింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు, దేవగుడి కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన కుటుంబాలతో భూపేష్‌రెడ్డి